



పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం

ఆత్మ పథకంపై రైతులకు అవగాహన కరువు

జిల్లాలో సాగుపై సలహాలు, సూచనలు అంతంతే

ఏఈవోలు లేనిచోటకు 'ఆత్మ' ఉద్యోగులు



నిధులు లేక నీరసం!



ఢిల్లీలో పంటల సాగుపై రైతులకు వివరిస్తున్న అన్నా హజారే (ఫైల్)

పంటల్లో నూతన ఒరవడి సృష్టించేందుకు ప్రభుత్వం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా క్షేత్రస్థాయి ప్రదర్శనలు, సదస్సులు, పర్యటనలు, పొలం బడులు నిర్వహించాలి. ఇందులో రైతులు తెలుసుకున్న సాగు పద్ధతులు తాము సాగు చేసే పంటల్లో అవలంబించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే, ఐదేళ్లుగా నిధుల లేమితో రైతులు పర్యటనలు, క్షేత్ర ప్రదర్శనలకు దూరమయ్యారు. మొదట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు మంజూరు చేసేవి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా నాలుగేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. కేంద్రం నిధులు విడుదలకు సుముఖత చూపుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలపై ఆసక్తి చూడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు లేక రైతులను పర్యటనలకు తీసుకెళ్లడం లేదు. దీంతో లక్ష్యం నెరవేరడం లేదు. ఇటీవల కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు సకాలంలో విడుదల చేస్తుందా అని రైతులు ఆశతో చూస్తున్నారు.

'అత్మ'తో.. రైతన్నలకు దక్కని భరోసా

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 25 : జిల్లాలో 27 మండలాలు, 558 పంచాయతీలున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, పెసలు, కందులు, పత్తి, మినుములు, వేరుశనగ , ఆముదం, చెరుకు సోయాబీన్, కూరగాయ తదితర పంటల సాధారణ విస్తీర్ణం 4,07,533 ఎకరాలుంటే వాటిలో 3,42,996 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అలాగే యాసంగిలో వరి, గోధుమ, జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి, శనగ, మినుములు, ఉలవలు, అలశందలు, వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వులు, ఇతర పంటలు కలుపుకుని 95వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు.. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారిని చైతన్య వంతులను చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకం నిర్వీర్యమవుతోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అవి ఎక్కడా మచ్చుకైనా కానరావడం లేదు. ఐదేళ్ల నుంచి అరకొర నిధులు రావడంతో రైతులతో క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించడం లేదు. ఏటా దాదాపు 25 నుంచి 50 మంది రైతులతో ఇతర ప్రాంతాల సందర్శనను నిర్వహించాలి. రైతులకు సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఏటా ఈ పథకం లక్ష్యం నిర్దేశించుకున్నా ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేక వాటి గురించి మర్చిపోవాల్సి వస్తోంది. నిధుల లేమితో రైతులు క్షేత్ర ప్రదర్శనకు వెళ్లడం లేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నాణ్యమైన నారుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ప్రయోజనం శూన్యం..

అరకొర నిధులతో ఆత్మ ద్వారా పెద్దగా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. గతంలో క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లిన రైతులు తమ ప్రాంతాల్లోని మిగతా రైతులకు తెలుసుకున్న అంశాలను వివరించే వారు. అయితే, ప్రస్తుతం పర్యటనలే లేకుండా పోయాయి. ప్రతి నెలా కమిటీ సమావేశాలు జరగడం లేదు. ఫలితంగా కార్యక్రమ ఆశయం మసకబారింది. సాగు పద్ధతులను తెలుసుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన రైతులు, పంట పొలాలకు బదులు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ సమయాన్ని వృథా చేశారన్న ఆరోపణలున్నాయి.

'ఆత్మ' ఉద్యోగులను..

ప్రత్యేకంగా 'ఆత్మ'కు జిల్లా స్థాయిలో ప్రాజెక్టు డైరక్టర్, ఇద్దరు బీటీఎంలు, ఆరుగురు ఏటీఎంలున్నారు. కొన్నేళ్లుగా ఆత్మకు నిధులు విడుదల చేయక పోవడంతో ఏటీఎంలు, బీటీఎంలకు పనిలేకుండా పోయింది. దీంతో వారిని వ్యవసాయ శాఖలో ఏఈవోలు లేని చోట నియమించి పని చేయించుకుంటున్నారు.

కానరాని కమిటీలు..!

సాగు సీజన్ రాగానే రైతులను పోగు చేసి సాగుకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల సస్యరక్షణ, విత్తన శుద్ధి, ఎంపిక, విత్తనాభివృద్ధితో పాటు ఎక్కడైనా రైతులు ఆదర్శంగా పంటలు సాగు చేస్తే ఇతరులకు చూపించాలి. ప్రస్తుతం ఎలాంటి కార్యక్రమాలూ లేకపోవడంతో కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. రైతు శ్రేయస్సు కోసం వివిధ కార్యక్రమాలు, పథకాలను చేపడుతున్న ప్రభుత్వం ఆత్మ కమిటీలను బలోపేతం చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతన్నలకు అవగాహన కరువు

వ్యవసాయ రంగం అభివృద్ధి సాధించాలంటే రైతులు అధునాతన విజ్ఞానం కలిగి ఉండాలి. అందుకు ఆధునిక యంత్రాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలి. కానీ వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో ఆత్మ పథకం ఉందన్న విషయమే రైతులకు తెలియకుండా పోతోంది. అసలు ఆత్మ అంటే ఏమిటి? దాని కార్యాలయం ఎక్కడ ఉంది? దానిలో ఎంతమంది పనిచేస్తారు? వారి ద్వారా రైతు లకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? అనే దానిపై జిల్లాలో చాలామంది రైతులకు ఇప్పటి వరకు అవగాహన లేకపోవడం గమనార్హం. పథకం ఉద్దేశాన్ని సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు రావడం లేదు

నేను జిల్లాకు వచ్చి రెండేళ్ల అయ్యింది. అప్పటి నుంచి నిధులు మంజూరు కాలేవు. క్షేత్ర స్థాయిలో సదస్సులు జరగడం లేదు. రైతులు ప్రదర్శనలు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇద్దరు బీటిఎంలు, నలుగురు ఏటీఎంలు ఉండగా వారిని వ్యవసాయశాఖలో ఏఈవోలు లేని స్థానాల్లో నియమించారు.

- వెంకటేశ్వర్లు, ఆత్మ పీడీ

'ఆత్మ' స్కీం ఉందో లేదో తెలియడం లేదు



నేను ఆత్మ కమిటీలో చైర్మన్‌గా పనిచేశా. రైతులను క్షేత్రలకు తీసుకెళ్లి పంట సాగుపై అవగాహన కల్పించేవాళ్లం. రైతు విజ్ఞాన యాత్రకు వెళ్లాం. రైతులను పూనె, ఢిల్లీ తీసుకెళ్లాను. అక్కడ వ్యవసాయ క్షేత్రాలను చూయించా. వివిధ పంటల సాగు విధానంపై అవగాహన కల్పించాం. నాలుగేళ్ల నుంచి ఈ పథకం నిర్వీర్యమైంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటీఎం లేదు. బీటీఎం లేదు. అసలు ప్రోగ్రామ్స్ నడవడం లేదు. స్కీం ఉందో లేదో కూడా తెలియటం లేదు.

- ఎన్నుు నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్, చేవెళ్ల డివిజన్



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- వేడుకలకు జిల్లా కలెక్టరేట్ ముస్తాబు
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 25 : జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి ఉదయం జరిగే వేడుకలకు సమీకృత కలెక్టరేట్ ముస్తాబైంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కె.శశాంక కలెక్టరేట్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించను న్నారు. ఉదయం 9.05 గంటలకు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. ఉదయం 9.10 గంటలకు జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం 9.25 గంటలకు బాల బాలికల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహిస్తారు. ఉదయం 10.15 గంటలకు ఉత్తమ సేవ సర్టిఫికెట్ల ప్రదానం, వందన సమర్పణ, ఉదయం 11 గంటలకు తేనేటి విందుతో కార్యమం ముగియనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు.

ఈ సారి కూడా స్టాల్స్, శకటాల లేవు

ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిపే విధంగా ప్రతీ ఏటా శకటాల ప్రదర్శన నిర్వహించేవారు. అలాగే వివిధ శాఖ లకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేసేవారు. కొంగర కలాన్‌లోని కొత్త కలెక్ట రేట్‌లోకి వచ్చాక స్టాల్స్ శకటాల ప్రదర్శన మరిచారు. రెండేళ్లుగా స్టాల్స్ ఏర్పాటు, శకటాల ప్రదర్శనకు బ్రేక్ పడింది. గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించేవారు. అయితే, ఈ సారి విద్యుత్ దీపాల అలంకరణ కూడా మరిచారు. వేడుకలకు తూతూ మంత్రం గానే కొనసాగుతున్నాయి. వేడుకలను తిలకించేందుకు వచ్చే వారు కూర్చు నేందుకు కుర్చీలు కూడా ఉండటం లేదు.

ఆ భూమిని అభ్యంతరాల జాబితాలో నమోదు చేశాం

- జాతీయ రహదారికి పాస్‌బుక్‌ల జారీపై కడ్తాల్ తహసీల్దార్ వివరణ

ఆమనగల్లు, జనవరి 25: జాతీయ రహదారులకు సేకరించిన భూమికి పాస్‌బు క్‌ల జారీ విషయంపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఈ భూములను ధరణిలోని అభ్యంతరాల జాబితాలో నమోదు చేశామని కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్ వెల్లడిం చారు. కడ్తాల్‌లో శ్రీశైలం జాతీయ రహదారి రెవెన్యూ వద్ద 'ఆ భూమి రికార్డులు లేవ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్ స్పందించారు. జాతీయ రహదారి కోసం సేక రించిన 1.20 ఎకరాల భూమికి గతంలోనే శరణం బసప్ప అనే వ్యక్తి పేరుతో పాస్ బుక్ ఉన్నందున అతని మరణానంతరం కూడా పాస్‌బుక్ కొనసాగిందని తెలిపారు. ఈ భూమిని రూ.5కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న విష యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందిన వెంటనే దీన్ని అభ్యంతరాల జాబితాలో నమోదు చేశామని తెలిపారు. ఈ 1.20 ఎకరాల భూమికి మాత్రం రైతుబంధు ఇవ్వడం లేదని వ్యవసాయాధికారులు తెలిపారని చెప్పారు. శ్రీశైలం జాతీయ రహదా రికి సేకరించిన భూములకు పాస్‌బుక్‌లు ఇచ్చిన వ్యవహారాలు, రైతుబంధు చెల్లింపు లపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. జాతీయ రహదారికి జరిగిన భూసేక రణ వివరాలు ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను కూడా కోరినట్లు ఆమె తెలిపారు. ధరణిలో లొసుగులు అడ్డుపెట్టుకుని ఎవరైనా ప్రభుత్వ ఆస్తులు విక్రయించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



షాద్‌నగర్ : మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా ఓటరు దినోత్సవం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటు ప్రత్యేకతను చాటి చెప్పారు.

షాద్‌నగర్ ఆర్డీవోకు అవార్డు



షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు

షాద్‌నగర్, జనవరి 25 : 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విశిష్ట సేవలకుగాను షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావుకు ఉత్తమ ఎన్నికల అధికారిగా ఎంపికయ్యారు. ఈమేరకు గురు వారం హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు -2024 అవార్డు స్వీకరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఆటం కాలు లేకుండా చూడటంతో పాటు, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా నిర్వహిం చినందుకు అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో తనకు ఉత్తమ ఎన్నికల అధి కారిగా అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు మరింత కృషి చేస్తాన న్నారు.

లెవీ బియ్యాన్ని అందించని మిల్లర్లపై చర్యలు

కడ్తాల్ , జనవరి 25: లెవీ బియ్యాన్ని నిర్ణీత గడువు లోగా అందించని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడుతామని పౌరసరఫ రాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునం దన్ హెచ్చరించారు. మక్తమాదారం లోని రైస్ మిల్లును గురువారం డీటీ తనిఖీ చేశారు. రికా ర్డులు, వడ్లు , బియ్యం నిల్వలను పరిశీలించారు. లెవి బియ్యాన్ని సకాలంలో , నిర్ణీత గడువులోగా మిల్లింగ్ పూర్తి చేయకుండా పలువురు మిల్లర్లు వివిధ కారణాలతో కాలయా పన చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి ఈనెల 31 లోగా లెవిని పూర్తిచేయాలని ఆదేశించామని, లేదంటే నిర్వాహకులపై చర్యలు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలువురు మిల్లర్లకు షోకాజ్ నోటీ సులు అందజేశామని తెలి పారు.



లాలాపేట్ ప్రాథమిక పాఠశాల, (ఇన్‌సెట్‌లో పెచ్చులూడిన గది)

ఐదు తరగతులు.. ఒక టీచర్ బడులు బాగుపడేనా!

- లాలాపేట్, ఉమ్మెంత్యాల పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక కుంటుపడుతున్న బోధన
- శిథిలావస్థకు చేరుకున్న లాలాపేట్ ప్రాథమిక పాఠశాల
- సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

కొందుర్గు, జనవరి 25 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో సతమతమవుతు న్నాయి. మండల పరిధిలోని లాలాపేట్ ప్రాథ మిక పాఠశాల, ఉమ్మెంత్యాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు తరగతులకు కలిపి ఒకే ఉపా ధ్యాయురాలు బోధిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. లాలాపేట్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 24మంది ఉండగా.. బోధించేందుకు మౌనిక అనే ఉపాధ్యాయురాలు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఒకవేళ టీచర్ సెలవు పెడితే పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి. కాగా, ఐదు తరగతుల విద్యా ర్థులను ఒకే గదిలో కూర్చోబెట్టుకుని బోధిస్తుండ టంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను ఎలాగో నెట్టుకొస్తుం డగా, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని, పెచ్చులూడి కింద పడుతుండడంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు జంకుతు న్నారు. లాలాపేట్ పాఠశాలలో రెండు గదులుం డగా.. ఒక గది శిథిలావస్థకు చేరుకోగా, మరో గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు కలిపి బోధి స్తున్నారు. ప్రస్తుతం ఆ గది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్ల లను పాఠశాలకు పంపాలంటేనే జంకుతున్నారు.

ఉమ్మెంత్యాలలోనూ ఒకరే ఉపాధ్యాయురాలు

మండల పరిధిలోని ఉమ్మెంత్యాలలోని ప్రాథ మికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల కొరతతో ప్రాథమిక పాఠశాలగా మారింది. పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల్లో 7 మంది చొప్పున, మూడో తరగతిలో ఇద్దరు, నాలుగో తరగతిలో ముగ్గురు, ఐదవ తరగతిలో 5మంది విద్యార్థులు న్నారు. మొత్తం 24 మంది విద్యార్థులుండగా.. బోధించేందుకు విఘ్నేశ్వరి అనే ఉపాధ్యాయు రాలు మాత్రమే ఉన్నారు. ఒక గదిలో 3, 4, 5 తరగతులను, 1, 2 తరగతుల విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టుకొని తరగతులు బోధిస్తు న్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించా లని, లాలాపేట్ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని, లాలాపేట్, ఉమ్మెంత్యాల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెండు స్కూళ్లను నడిపితే ఎంతో మేలు?

లాలాపేట్, ఉమ్మెంత్యాల ప్రాథమిక పాఠశా లల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులుండాల్సి ఉండగా, 317 జీవో వల్ల ఆ పాఠశాలల్లో ఉపా ధ్యాయుల కొరత ఏర్పడింది. ఈ రెండు పాఠశా లల్లోనూ 24మంది చొప్పున విద్యార్థులున్నారు. వారి సంఖ్యకనుగునంగా ఒక్కో పాఠశాలలో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులుండాల్సి ఉండగా ఒక్కో ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారు. లాలాపేట్ పాఠశాలలో ఉన్న రెండు గదులు కూడా శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడిపడు తున్నాయి. కాగా, లాలాపేట్, ఉమ్మెంత్యాల గ్రామాల మధ్య దూరం కేవలం అర కిలోమీటర్ మాత్రమే ఉంది. లాలాపేట్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, కొత్త భవనం మంజూరై, నిర్మాణం జరిగే వరకు ఆ పాఠశా లను ఉమ్మెంత్యాల పాఠశాల భవనంలోకి తాత్కాలికంగా మార్చాలి. దీనివల్ల ఉమ్మెంత్యాల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో వృథాగా ఉన్న గదులు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. ఇద్దరు ఉపాధ్యాయురాళ్లు ఒకే పాఠశా లలో ఉండటం వల్ల ఒకరు సెలవు పెట్టినా, మరొకరు పాఠశాలను కొనసాగిస్తారు. అదేవి ధంగా రెండు గ్రామాల పాఠశాలలను తాత్కాలి కంగా ఒకే దగ్గర కొనసాగిస్తే ఇబ్బందులు ఉండవు. లాలాపేట్ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం మంజూరై, నిర్మాణం జరిగాక.. యథావిధిగా కొనసాగించవచ్చు. ఈ దిశగా విద్యాశాఖ అధికారులు, రెండు గ్రామాల సర్పం చులు, గ్రామస్థులు ఆలోచించాలి.



ఉమ్మెంత్యాల పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు విఘ్నేశ్వరి

మరో ఉపాధ్యాయుడిని నియమించాలి



మా పాఠశాలలో 5తరగతులకు ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. అన్ని తరగతుల వారందరం ఒకే దగ్గర కూర్చుంటున్నాం. కొందరికి పాఠాలు చెప్తుండగా, మరి కొంత మంది ఖాళీగా ఉంటున్నాం. అందరికీ ఒకే సారి పాఠాలు చెప్పడం టీచర్‌కు ఇబ్బం దిగా మారింది. మా పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలి.

- మానస, 5వ తరగతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశాం



పాఠశాలలో ఉపాధ్యాయల కొరత ఉండ డంతో.. నేనే 5 తరగతులకు బోధిస్తు న్నాను. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ నెల 8న వినతి పత్రం అందజేశాం. నూతన భవనం ఏర్పాటు చేయాలి. టీచర్ల కొరత లేకుండా చూడాలి.

మౌనిక, ఉపాధ్యాయురాలు, లాలాపేట్ పాఠశాల

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



మండల పరిధిలోని లాలాపేట్, ఉమ్మెం త్యాల ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యా యుల కొరత ఉంది. ఆ పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులుండాలి. కానీ, ప్రస్తుతం ఒక్కొక్కరే ఉన్నారు. 317 జీవో వల్ల సిబ్బంది కొరత ఏర్పడింది. ఈ సమ స్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి కూడా తెలియజేశాం.

- కిష్టారెడ్డి, ఎంఈవో, కొందుర్గు

వ్యవసాయ కార్మిక సంఘం
భవన నిర్మాణానికి నిధుల సేకరణ

దోమ, జనవరి 25: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా భవన నిర్మాణాన్ని ఢిల్లీలో నిర్మించేందుకు ప్రజల నుంచి నిధుల సేకరణకు వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం దిర్సంపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి నిధుల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, రఘురాం, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, మొగులయ్య, శేఖర్, కృష్ణ, సాయిబాబు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లెమోనిగూడలో కార్డన్ సెర్చ్

● 31 వాహనాల సీజ్


మల్లెమోనిగూడలో తనిఖీ చేస్తున్న సీఐ వెంకటరామయ్య

పరిగి, జనవరి 25: పరిగి మున్సిపల్ పరిధి లోని మల్లెమోనిగూడలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. మొత్తం 31వాహనాలను సీజ్ చేశారు. 25బైక్‌లు, మూడు త్రీవీలర్స్, మూడు ఫోర్‌వీలర్స్ వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాలకు ఆర్‌సీలు, ఫిట్‌నెస్ లేకున్నా సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీశైలం, గిరన్నలు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వహించరాదు

కీసర రూరల్, జనవరి 25: పన్ను వసూళ్లలో అలసత్వం వహించరాదని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ రాజేందర్‌కుమార్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం 45శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయన్నారు. గడువు సమీపిస్తున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తైన ఇళ్లకు పన్నులను నిర్ధారించి వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధానిగా గెలవాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 25: ప్రపంచంలో భారత్ నెంబర్-1 గా ఎదగాలంటే ప్రధాని మోదీ మళ్లీ గెలవాలని మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలోనూతన ఓటర్లతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ. భారత్ స్థాయిని ప్రపంచంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టగలిగే శక్తి కేవలం ప్రధాని మోదీకి మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో యువత మొత్తం బీజేపీ వైపు చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయరాజ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి, బీజేవైఎం మోమిన్‌పేట మండల ప్రెసిడెంట్ ఆసిరెడ్డి, నరోత్తంరెడ్డి, బసవలింగం విద్యార్థులు పాల్గొన్నారు.



గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

'స్వీప్'లో వికారాబాద్‌కు రెండో స్థానం

● గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

వికారాబాద్/కులకచర్ల, జనవరి 25 : ఓటరు నమోదు ప్రక్రియ 'స్వీప్' కార్యక్రమాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచింది. ఓటరు నమోదు, ఓటరు అవగాహన సదస్సులు, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించడంలో జిల్లా ముందంజలో ఉంది. అలాగే ఓటర్ల నమోదు, ఓటుహక్కు వినియోగించుకునే విషయంలో చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల స్కిట్‌కు రెండో బహుమతి లభించింది. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా స్వీప్ జిల్లా నోడల్ అధికారి కోటాజీ, చౌడాపూర్ స్కూలు విద్యార్థులతో కలిసి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జిల్లా ఎన్నికల అధికారి కోటాజీ, హెచ్ఎం సురేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ పనులు చేపట్టాలి


రైల్వే శాఖ డీఆర్ఎంకు వినతి సమర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 25: మేడ్చల్‌లో నిలిచిన రైల్వే అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైల్వే శాఖ సికింద్రాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నిలిచిన అండర్ బైపాస్ పనుల కారణంగా నాలుగు సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. ఈ మేరకు వచ్చే ఆదివారం నుంచి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం హామీ ఇచ్చినట్లు జడ్పీచైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, ఎల్లంపేట ఎంపీటీసీ కుమార్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక బీజేపీని ఓడించండి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

● ఆమనగల్లులో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

ఆమనగల్లు , జనవరి 25 : దేశంలో కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక , రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేయాలని వారు సూచించారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను, పెంచిన నిత్యావసరాల ధరలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. వందలాది ట్రాక్టర్లతో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతులు, రైతు కూలీలు , రైతు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాగర్, మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటాల ఫలితంగా దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను ఉప సంహరించుకుని పార్లమెంట్‌లో బిల్లు పెడుతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి మళ్లీ డొంక దారిన నల్ల చట్టాలను అమలు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ విధానాలను దేశ ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుసంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త కార్యాచరణను రూపొందించినట్లు చెప్పారు. రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రాంచందర్, పి.అంజయ్య, కార్యదర్శి కె.జగన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కానుగుల వెంకటయ్య, ఆర్.జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి రామకృష్ణారెడ్డి, సంయుక్తకార్యదర్శి మునలయ్య, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, రైతుసంఘం నాయకుడు వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు అరుణ్, కురుమయ్య, లాలునాయక్, బాలు, యాదయ్య, పాల్గొన్నారు.


ఆమనగల్లులో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

● ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి

ఆమనగల్లు , జనవరి 25 : బాలికల సంరక్షణ అందరిబాధ్యత అని ఐసీడీఎస్ మండల సీడీపీవో సక్కుబాయి అన్నారు. కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో గురువారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో హాజరై విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. రాంనుంతల గ్రామ పంచాయతీలో సర్పంచ్ సోనశ్రీనునాయక్ అధ్యక్షతన మహిళా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సక్కుబాయి మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఎంపీటీసీ సరితపంతూ నాయక్, ఎస్‌వో పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భక్తశబరి, జయమ్మ, పార్వతి, పద్మ, కేజీబీవీ, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.


మహిళా గ్రామసభలో ఐసీడీఎస్ అధికారులు

'మత్తు'తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

● యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ భాస్కర్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25 : విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ భాస్కర్ అన్నారు. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్ ఏసీఈ ఇంజనీరింగు కళాశాలలో గురువారం మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలుంటాయని చెప్పారు. మత్తుకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. అనంతరం మత్తుపదార్థాలకు అలవాటు కావొద్దని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, జీవన్‌రెడ్డి, రాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ భాస్కర్, కళాశాల అధ్యాపకులు

మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.300 కోట్లు

కొడంగల్, జనవరి 25 : నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గురువారం కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఈ నివేదికలను అందించారు. దశల వారీగా ఐదు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన పనులున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో క్రీడా ప్రాంగణం, పార్కులు, పాత కొడంగల్ సమీపంలో బస్తీ దవాఖాన, స్వాగతతోరణం, తాండూర్ నుంచి కోస్గి రోడ్డు మధ్యలో విద్యుత్ దీపాల అలంకరణ, షాదీఖానా నిర్మాణం, పాత భవనాల కూల్చివేత, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులకు ప్రతిపాదనలు అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక కడా ఏర్పాటుతో అన్నివిధాలుగా అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు అన్నారు. నిధులు మంజూరయ్యాక పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


వెంకట్‌రెడ్డికి నివేదిక అందిస్తున్న గురునాథ్‌రెడ్డి, తదితరులు

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 25 : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే రోడ్డుప్రమాదాలను నివారించగలుగుతామని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. రోడ్డుభద్రతా వారోత్సవాల సందర్భంగా గురువారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లు, పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లు ట్రాఫిక్ భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. బస్టాప్‌లలో కాకుండా రోడ్లపై అనవసరంగా బస్సులను ఆపరాదని, యూటర్న్ తీసుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మైనర్లకు తల్లితండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లితండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కార్లలో వెళ్లే వారు సీట్ బెల్ట్‌ను విధిగా ధరించాలన్నారు. ఆర్టీసీ డీఎం ఉషా, ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్, సిబ్బంది జితేందర్‌రెడ్డి, నర్సింహాగౌడ్, మస్తాన్ వలి, శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

చేవెళ్ల, జనవరి 25 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అమ్మఒడి అనే యాప్ సేవలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది వివరాలను యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. గర్భిణీలకు అందిస్తున్న వైద్యసేవలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. పసి పిల్లలకు, గర్భిణీలకు టీకాలు క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. వైద్యులు రేవతి, సుదర్శన్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మండల కేంద్రంలో మాట్లాడుతున్న చేవెళ్ల డిప్యూటి డిఎంహెచ్‌వో దామోదర్

జోరుగా అనుమతి లేని నిర్మాణాలు

● పట్టించుకోని అధికారులు

● ప్రభుత్వ ఆదాయానికి గండి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25: బఫర్‌జోన్‌లో జోరుగా అక్రమనిర్మాణాలు వెలుస్తున్నాయి. అయినా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ అటు పంచాయతీకి, ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని మర్రిపల్లిగూడ రెవెన్యూ పరిధి బఫర్‌జోన్‌లోని సర్వేనెంబర్లు 51, 53లలో అక్రమనిర్మాణాలు వెలుస్తున్నాయి. ఘట్‌కేసర్ -ఎదులాబాద్ మార్గంలో రోడ్డుపక్కనే పెద్దఎత్తున్న నిర్మాణాలు చేపట్టారు. అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. 60గజాల్లో నిర్మాణాలు చేపడితే అనుమతులు లేవని హడావిడి చేసే అధికారులు ఇంతపెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నా ఏం చేస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే పనులు నిలిపివేస్తూ మిగతా సమయాల్లో నిర్మాణాలను పూర్తిచేసుకుంటున్నారు. ముఖ్యంగా సెలవురోజులు వచ్చాయంటే అక్రమనిర్మాణాల జోరుపెంచుతూ పనులు ముగించుకుంటున్నారు. ఇప్పటికైనా మర్రిపల్లిగూడ బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మర్రిపల్లిగూడలో నిర్మించిన అక్రమనిర్మాణాలు

అక్రమనిర్మాణాలను కూల్చివేస్తాం

మరిపల్లిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 51, 53లలో వెలసిన అనుమతి లేని నిర్మాణాలకు నోటీసులిచ్చాం. పై అధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలను కూల్చివేస్తాం



- శ్రీనివాస్, కార్యదర్శి మర్రిపల్లిగూడ

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

నందిగామ, జనవరి 25: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సప్పగూడలో అంజయ్యయాదవ్ స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలతోనే మమేకమై ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుదామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, రాజగోపాల్, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ కళమ్మ నాయకులు మామిళ్ల విఠల్, సుదర్శన్‌గౌడ్, జంగిలి కుమార్, సత్యం, భూపాల్, నర్సింహ, శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నర్సప్పగూడలో కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

సీఎం రేవంత్‌తో వంశీచంద్‌రెడ్డి భేటీ

ఆమనగల్లు , జనవరి 25 : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డితో గురువారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు , కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి తదితర విషయాలపై చర్చించారు. పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని వంశీచంద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


సీఎం తో భేటి అయిన వంశీచంద్ రెడ్డి

కోదండరాంకు ఎమ్మెల్సీ పదవిపై హర్షం

తాండూరు, జనవరి 25: తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టడంపై తాండూరు తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీతో ఆయనను గౌరవించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీజేఎస్ ఇన్‌చార్జి, తెలంగాణ ఉద్యమకారుడు, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. కోదండరాం చట్టసభల్లో ఉంటే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు.


కోదండరాంను సన్మానిస్తున్న సోమశేఖర్

ఉపాధి పనులకు వెళ్లి కూలీ మృతి

కడ్తాల్ , జనవరి 25 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఓ కూలీ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాలో గురువారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గోవిందాయిపల్లి తండాకు చెందిన కేతావత్ రాములు (44) రోజు మాదిరిగా ఉదయం 9 గంటలకు ఉపాధి పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రాములును మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య శారద, నలుగురు పిల్లలు ఉన్నారు. రాములు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ రామునాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

గ్రామాల్లో బీఎస్పీని బలోపేతం చేస్తాం

షాబాద్ /చేవెళ్ల, జనవరి 25 : గ్రామాల్లో బహుజన్ సమాజ్ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బిఎస్పీ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బర్క కృష్ణయాదవ్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో బీఎస్పీ నూతన మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో బిఎస్పీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు వేస్తున్నామన్నారు. షాబాద్ మండల అధ్యక్షుడిగా కందివనం శ్రీశైలం, కోశాధికారిగా పెండాల చందును ఎంపిక చేసి నియామక పత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రాజ మహేంద్రవర్మ, అధ్యక్షుడు చందు, జిల్లా కార్యదర్శి కర్రే శ్రీశైలం, మండల ఉపాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి మహేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సతీష్, రమేశ్‌యాదవ్, విజయ్‌కుమార్, నర్సింలు, జంగయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఎంఈవో అక్బర్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

చేవెళ్ల, జనవరి 25 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని ఎంఈవో అక్బర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో అంకురం ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, వంటకాలు, ఉత్పత్తులను పాఠశాలలో విక్రయానికి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, ప్రిన్సిపాల్ టీనావతి, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

డీఎంహెచ్‌వోకు ఫస్ట్ బెస్ట్ అవార్డు

వికారాబాద్, జనవరి 25: రాష్ట్రస్థాయిలో 2023 సంవత్సరానికి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వాన్ కుమార్ అత్యున్నత ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు ఫస్ట్ బెస్ట్ వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజాలో గురువారం తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్నన్, డైరెక్టర్ ఆఫ్‌పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్‌లు అవార్డును అందజేశారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- అధికారులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- అవగాహన ర్యాలీలు.. పాల్గొన్న విద్యార్థులు, పౌరులు


చేవెళ్ల : సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఆర్డీవో సాయిరాం

చేవెళ్ల, జనవరి 25 : ప్రజాసామ్య వ్యవస్థలో ప్రతీ ఒక్కరు ఓటు అనే ఆయుధంతో మంచి నాయకుడిని ఎన్నుకొనేందుకు అవకాశం ఉందని, ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని చేవెళ్ల మండల కేంద్రంలో అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, టీచర్లతో కలిసి ప్రతిజ్ఞ చేసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈవో అక్బర్, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సైలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్, గ్రామస్థులున్నారు. అలాగే చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాంచనలత, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్లేనని, 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. నూతనంగా నమోదైన ఓటర్లతోపాటు వృద్ధులైన ఓటర్లను సన్మానించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు.


మహేశ్వరం : జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తహసీల్దార్ అన్వర్, విద్యాధికారి కె.వెంకట్‌రెడ్డి, సీఐ ఆంజనేయులు, డీటీ శ్రీనివాస్, తదితరులున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ప్రభు మాట్లాడుతూ ఓటు అనేది విచక్షణా సాధనమని ప్రతీఒక్కరు వినియోగించుకోవాలన్నారు.

మహేశ్వరం : ప్రతీఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టరు ప్రతిమాసింగ్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహేశ్వరం మండల కేంద్రంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఎంపీపీ సునితఅంద్యానాయక్, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీవో బి.నర్సింహులు, ఎంఈవో కృష్ణ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ తదితరులున్నారు.

కందుకూరు : ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని తహసీల్దార్ కె.గోపాల్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో పలు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐలు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాచారం : తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పలువురు ఓటర్లు తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఓటర్లచేత ప్రమాణం చేయించారు. డీటీ సాగర్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో లింగయ్య, వివిధ శాఖల ఉద్యోగులు ఓటర్లు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : 18 ఏళ్లు నిండిన పౌరులు ఓటు నమోదు చేసుకోవాలని ఎమ్మార్వో పార్థసారధి సూచించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ స్టేడియం నుంచి చౌరస్తా వరకు జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లు, భయానికి గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఓటుకు నోటు ప్రజాస్వామ్యానికి చేటు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

చౌదరిగూడ : ఓటు వజ్రాయుధం అని.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అవసరమని ఎంపీడీవో మహేష్ బాబు అన్నారు. నాయబ్ తహసీల్దార్ అర్షద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ వెంకటస్వామి, ఏపీఎం రామస్వామి, హెచ్ఎం విల్సన్ సునీల్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు పొందాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో మానహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ వెంకట్ రెడ్డి, డీటీ గీత, ఆర్ఐ నివేదిత, దశరథ, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులున్నారు.

ఆమనగల్లు/కడ్తాల/తలకొండపల్లి : చరిత్రను మార్చగలిగే శక్తి కేవలం ఓటుకు మాత్రమే ఉందని


ఇబ్రహీంపట్నం : వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి, తదితరులు

ఆమనగల్లు తహసీల్దార్ లలిత, ఎంపీడీవో పారుఖ్ హుస్సేన్‌లు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఎస్.అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, పలుశాఖల అధికారులతో పాటు వారు పాల్గొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీఎల్‌వోలు వివిధ శాఖల అధికారులు, సిబ్బందిచే జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్, మున్సిపల్, మండల పరిషత్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ రంగారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ, అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు.


ఆమనగల్లు : ప్రభుత్వ కళాశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ లలిత


కందుకూరు : స్థానికులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ గోపాల్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం

- బైక్‌పై వెళుతుండగా ఢీకొన్న డీసీఎం.. అక్కడికక్కడే మృతి


భాను(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 25 : రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం-రాయపోల్ రోడ్డులో గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టడంతో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన రావుల భాను(20), తల్లి పార్వతమ్మ(39)లు మోటార్ సైకిల్‌పై స్వగ్రామం నుంచి ఇబ్రహీంపట్నం వస్తుండగా రాయపోల్ రోడ్డు వైట్‌గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్‌టెక్స్ పార్కు వద్దకు చేరుకున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పార్వతమ్మ, భానులు అక్కడికక్కడే మృతిచెందారు. డీసీఎం డ్రైవర్ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా, డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షైబెల్లి తెలిపారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

యాచారం, జనవరి 25 : అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు వాడి బ్లాస్టింగ్ చేస్తుండగా గురువారం సాయంత్రం పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యవారిగూడలో దేరంగుల సత్యనారాయణ, దేరంగుల మల్లేష్, వరికుప్పల పెద్దయ్యలు భారీ బండరాళ్లను పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తున్నట్లు సమాచారం అందింది. దాంతో పోలీసులు వెళ్లి పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఘటనా ప్రదేశంలో 41 జిలెటిన్‌స్టిక్స్, 30 డిటోనేటర్లు, కంప్రెసర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు.. జేసీబీ, టిప్పర్ సీజ్

కేశంపేట, జనవరి 25 : మండల పరిధిలోని చింతకుంటపల్లి శివారులో గల చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం చెరువు నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని గ్రామానికి చెందిన అనేమోని మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, జేసీబీ, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో చోరీ

నందిగామ, జనవరి 25 : నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాకలి గుట్టతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం చోరీ జరిగింది. బుధవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శి విధులు ముగించుకొని కార్యాలయానికి తాళం వేసి ఇంటికెళ్లాడు. గురువారం ఉదయం కార్యాలయానికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తెలిచి ఫైల్స్ చిందరవందరగా ఉండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటన స్థలాన్ని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యదర్శి శ్రీనివాసచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు


కల్యాణి

కడ్తాల్, జనవరి 25 : మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన స్వర్ణకంటి కల్యాణి అదృశ్యమైనట్లు ఆమె తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తమాదారం గ్రామానికి చెందిన భావమ్మ-నర్సింహ దంపతుల కూతురు కల్యాణి ఈనెల 11న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు తెలిసినవారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. తల్లి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఫిబ్రవరి 9న ఆదిభట్ల మున్సిపల్ 'అవిశ్వాస సమావేశం'

- సభ్యులకు నోటీసులు అందజేసిన అధికారులు
- చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసానికి సిద్ధం

ఆదిభట్ల, జనవరి 25 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీలో అవిశ్వాసపర్వం తుదిదశకు చేరుకుంది. చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాసం తీర్మానం పెట్టనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అధికార ప్రతిపక్ష సభ్యులు కలిసి ఈనెల 5న కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో మొదలైన చర్చ రోజుకో మలుపు తిరుగుతూ వచ్చింది. కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు గురువారం తెరపడింది. మొత్తం 15మంది మున్సిపల్ సభ్యులకుగాను 11 మందికి గురువారం వ్యక్తిగతంగా నోటీసులు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. మరో నలుగురు సభ్యులకు శుక్రవారం అందజేస్తామని, వచ్చేనెల 9న సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటీసులు చేరడంతో అవిశ్వాస తీర్మానంపై ఇప్పటివరకు ఉన్న అనుమానాలు పూర్తిగా తొలిగిపోయాయి. ఫిబ్రవరి 9న అవిశ్వాసం కోసం పూర్తిగా సమాయత్తం అవుతున్నారు. కాగా, పాలక, ప్రతిపక్ష సభ్యులు ఇప్పటికే క్యాంపులో ఉన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు నాయకుల శుభాకాంక్షలు


కోదండరాంతో మల్‌రెడ్డి, నాయకులు

యాచారం, జనవరి 25 : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ.కోదండరాంకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో యాచారం మండల నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరగా.. ప్రొఫెసర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు దెంది రాంరెడ్డి, ముచ్చర్ల సంపత్‌కుమార్, అమృతసాగర్, సుధీర్‌రెడ్డి తదితరులున్నారు.

ఏపుగా పెరిగిన టేకుచెట్ల నరికివేత

యాచారం, జనవరి 25 : విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా 11కేవీ, ఎల్టీ విద్యుత్ వైర్ల కింద చెట్ల నరికివేత సాగుతున్న మాట విధితమే. మండలంలోని నందివనపర్తిలో 11 కేవీ విద్యుత్ వైర్ల కింద చాలా ఏపుగా పెరిగిన టేకు చెట్లను ట్రాన్స్‌కో సిబ్బంది అడ్డదిడ్డంగా నరికివేయడంతో నష్టపోయామని వెంకటేష్ అనే రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. చెట్లు మోడుగా మిగలడం చూసి బాటసారులు కూడా విస్తుపోతున్నారు.



పేదల సంక్షేమానికే ఆరు గ్యారంటీలు

చౌదరిగూడ, జనవరి 25: పేదల సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇంద్రనగర్‌లో సర్పంచ్ మహబూబ్‌బీ అధ్యక్షతన ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, మండలాధ్యక్షుడు రాజు, అక్రం, జబ్బార్, చంద్రశేఖర్, ఎజాజ్, అన్వర్, వేణుగోపాల్, చంద్రశేఖర్, లక్ష్మణ్, నాయకులున్నారు.


ఇంద్రనగర్ జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నవభారత్ నిర్మాణంలో యువకులదే కీలక పాత్ర


చేవెళ్ల : భారతమాత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు

షాద్‌నగర్, జనవరి 25 : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన నవభారత్ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్యాట అశోక్ అధ్యక్షతన నమో నవమతదాన్ సమ్మేళనం నిర్వహించారు. అలాగే జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మోదీ వర్చువల్ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు చెట్ల వెంకటేష్, రణధీర్ గౌడ్, ఉదయ్ కుమార్ తదితరులు వీక్షించారు.


షాద్‌నగర్ : మాట్లాడుతున్న అందె బాబయ్య

యువత బంగారు భవిష్యత్తుకు మోదీ గ్యారంటీ

చేవెళ్ల : యువత బంగారు భవిష్యత్తుకు మోదీ గ్యారంటీ ఇస్తున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని వీరయ్యగార్డెన్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నూతన ఓటర్ల నమో నవమతదాన్ సమ్మేళనం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యుడు గుడిపల్లి నితీష్‌రెడ్డి, నాయకులు ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, యువమోర్చా మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి : సీఐ

శంషాబాద్‌రూరల్ జనవరి 25 : ఇక నుంచి రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని శంషాబాద్ సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మండలంలో ఎక్కడైనా నేరాలు, ఘోరాలు జరిగిన మీపై పోలీస్ కన్ను ఉంటుందని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా భూదందాలు, సెటిల్‌మెంట్లు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్లపై ఫిర్యాదు వస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మండలంలో 13 రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.


కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనాథ్

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

ఆమనగల్లు, జనవరి 25: ఆలయాల అభివృద్ధి, ఉద్యోగులు, అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సిరసనగండ్ల సీతారామ చంద్రస్వామి పూజారులు గురువారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వచనం ఇచ్చారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా చేయూతనందించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని పురాతన దేవాలయాలను ఆధునీకరించి భక్తులకనుగుణంగా వసతులు కల్పిస్తామని చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న అర్చకులు

చేవెళ్ల పరిధిలో ఎస్సైల బదిలీలు

చేవెళ్ల, జనవరి 25 : చేవెళ్ల డివిజన్ పరిధిలోని షాబాద్, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్లకు కొత్త ఎస్సైలు రానున్నారు. ఈమేరకు సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న బాల్‌రాజ్‌ను మాదాపూర్‌కు.. ఆయన స్థానంలో రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న ఎండీ ఆరిఫ్‌ను షాబాద్‌కు బదిలీ చేశారు. మాదాపూర్‌లో పనిచేస్తున్న రాజుల నర్సింహారావును మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

పూజారి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్థులు

ఆదిభట్ల, జనవరి 25 : మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో గల పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రధాన పూజారి శ్రీరాములు పంతులు ఇటీవల మృతిచెందారు. దాంతో ఆయన కుటుంబానికి కొంగరకలాన్ గ్రామస్థులు రూ.లక్షా80వేల ఆర్థిక సాయం అందించారు. 40 ఏళ్లుగా గ్రామస్థులతో తత్సంబంధాలు కలిగి ఈనెల 12న అకాల మరణం చెందడంతో చలించిన గ్రామస్థులు దహన సంస్కారాలు మొదలు ఇతర సామగ్రి సమకూర్చారు. కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు రూ.లక్షా80వేల నగదు సేకరించి పూజారి కుమారుడికి గురువారం అందజేశారు. ఎప్పటిలాగే ఆలయంలో సేవలందిస్తూ ఇక్కడే ఉండాలని, గ్రామాన్ని విడిచిపోవద్దని గ్రామస్థులు పంతులు కుటుంబసభ్యులను వేడుకున్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్, జనార్ధన్‌గౌడ్, లక్కరాజు శ్రీనివాస్ రావు, కాకి నగేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా గ్రామాభివృద్ధికి కృషి

చేవెళ్ల, జనవరి 25 : గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కేసారం సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కేసారంలో పంచాయతీ నిధులు రూ.8లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్ల పనులను చేవెళ్ల ఎంపీటీసీ రాములుతో కలిసి సర్పంచ్ రమేశ్‌గౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రజితరెడ్డి, వార్డుసభ్యులు నర్సింహరెడ్డి, నర్సింహగౌడ్, బాలమణి, చంద్రకళ, రాజిరెడ్డి, దయానంద్‌గౌడ్, నాయకులు సీతారాంరెడ్డి, శ్రీను, రాజు, గ్రామస్థులు తదితరులున్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేశ్‌గౌడ్

రాష్ట్రంలో పారదర్శక పాలన : ఎంపీపీ

కడ్తాల్, జనవరి 25: పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ప్రజలపై భారం మోపకుండా పారదర్శక, సంక్షేమ పాలన అందిస్తుందని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గానుగుమర్ల తండాలో ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.6లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం జడ్పీటీసీ దశరథ్ నాయక్, సర్పంచ్ హంసమోత్యానాయక్‌లతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీవో మధుసూదనాచారి, ఉపసర్పంచ్ శారద పాండునాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ

కేశంపేట, జనవరి 25 : టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని గురువారం పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన జంగయ్యకు నివాళులర్పించారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామ్మోహన్, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కార్యదర్శులుగా కృష్ణయ్య, నర్సింలు, స్వప్న, చిన్నరాములును ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శులు జి.శివారెడ్డి, నర్సింలు, శ్యామల దేవి, ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **ఆమనగల్లు :** హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెన్షన్‌కు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రాలకు చేరుకున్న బూత్ అధ్యక్షులు, మండల, బ్లాక్, జిల్లా నాయకులతో కలిసి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బీచ్యానాయక్, కిషన్ రెడ్డి , మానయ్య లు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో ఎల్‌బీ స్టేడియంకు తరలివెళ్లారు.
- **శంషాబాద్‌రూరల్ :** కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రాంత పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత అన్నారు. శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తపాలాసేవలను ప్రతీఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాలాధికారులు హైమావతి, చలపతి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.
- **కొందుర్గు :** తెలంగాణ గ్రామ పంచాయితీ వర్కర్స్ క్యాలెండర్‌ను మండల కేంద్రంలో ఎంపీడీవో డాక్టర్ అంజనేయులు విడుదల చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.
- **ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, పలు ఎరువుల దుకాణాలను తహసీల్దార్ లలిత, ఏవో అరుణకుమారి తనిఖీ చేశారు. రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని డీలర్లకు సూచించారు. ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని సూచించారు.
- **కడ్తాల్ :** కానుగుబావి తండాకు చెందిన కొర్ర రవి సొంతింటి కలను కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్ సాకారం చేశారు. సొంత ఇళ్లులేక ఏళ్లకాలంగా రవి కుటుంబం ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ రవికి ఇంటి నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా, ఉపసర్పంచ్ శారద పాండునాయక్ ప్రోత్సాహంతో ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్, ఖర్చులు దశరథ్ నాయక్ అందజేశారు. నిర్మాణం పూర్తైన ఇంటిని గురువారం లబ్దిదారుడు కేతావత్ రవి , తండా నాయకులతో కలిసి దశరథ్ నాయక్ ప్రారంభించారు.
- **ఆమనగల్లు :** పంటల సాగులో రైతులు తగిన మెళకువలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి కోరారు. చీడపీడల నివారణలో రైతులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని రాంనుంతలలో గురువారం ఏవో పర్యటించారు. పలువురు రైతులుసాగు చేసిన యాసంగి వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వేరుశనగలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు.
- **కందుకూరు :** ప్రభుత్వం పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మీర్కాన్‌పేట నాయకులు కె.మధన్‌పాల్‌రెడ్డి, కాకి చిన్న నర్సింహ, శ్యామ్‌సుందర్‌లు అన్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు 200మందికి రూ.25లక్షల విలువ గల స్పోర్ట్స్‌కిట్లు, యూనిఫామ్స్ గ్రామానికి చెందిన వంగూరు వెంకటేస్, శ్రీశైలం యాదవ్‌లతో కలిసి అందజేశారు.
- **కేశంపేట :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేశంపేట పోలీస్ ఆధ్వర్యంలో గురువారం భారత రాజ్యాంగం గొప్పతనంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని బీఎస్ఎస్ వరప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తామని ఎస్ఐ తెలిపారు.
- **షాద్‌నగర్ :** దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం షాద్‌నగర్ పట్టణంలో సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది.